# 'శివుడాజ్ఞ అయ్యింది'

◈ వడ్లమూడి ప్రభావతీదేవి

"ఏమిటండీ ఏదో సందడి?" గోల అనబోయి ఎంతో నిగ్రహించుకుని అడిగారు సూర్యంగారు, ఆర్భాటమంతా తనదే అన్నట్టుగాఅ అక్కడ తిరుగుతూన్న ఓ భారీ శాల్తీని.

"భజన... అండీ – భజన కార్యక్రమం ఏర్పాటు చేశాం భక్తులమంతా. రాత్రంతా జాగారం చేసి భజన చెయ్యాలి" నోరంతా తెరిచి సమాధానమిచ్చాడాయన. ఏ యాభై పళ్ళో వున్నట్టున్నాయందులో.

"ఈ రోజిలా పొద్దైపోయారెందుకని?" నోటిదాకా వచ్చింది ప్రశ్న. మామూలుగా ఈపాటికి ఆ ముఠా అంతా ఎక్కడోచేరి వేరే పూజాకార్యక్రమంలో తలమున్కలయ్యే వేళ అది.

"ఏమిటివాళ విశేషం?"

"పండుగ రోజుగదా!" ఓరి పామరుడా ఈ మాత్రం తెలియదా? నరకానికి పోతావురా అన్నట్టున్నాయా చూపులు. నిజమే, ఏం పండుగో ఆయన కెంతకీ స్ఫురించలేదు.

"నరయణ... నరయణ... ప్రభో! ప్రభో..." మైకు బద్దలవుతోంది.

"మైకులు చాలా పెట్టినట్లున్నారు?"

"ఎన్నైతేనేమండి స్వామివారి సేవ కోసం."

"అది కాదండీ మరీ ఎక్కువ శబ్దం... చాలా దూరం వరకూ ..." నసిగారు సూర్యంగారు.

"అంతా వినాలండీ... అందరూ తరించాల. మనకొక్కరికే పుణ్యం చాలనుకుంటే ఎలా?" ప్రజాసేవాతత్పరత కారిపోతోంది మహామభావుడిలో.

"అది కాదండీ... పరీక్షల రోజులు... రేపు మా అమ్మాయికి జువాలజీ ఎగ్జామ్ వుంది."

కాస్సేపు ఎగాదిగా చూశాడు సూర్యంగారి వంక. అప్పటిగ్గాని చూచాయగా ఆయన ప్రశ్నల అంతరార్థం అతనికి బోధపడలేదు.

"పరీక్షలా...ఎంత సోద్దమండి పంతులుగారూ మీకు. కాస్త దైవచింతన లేదే. నాలుగు ముక్కలు చెవినబడితే జీవితం తరిస్తది గదా. పరీక్షలు వస్తాంటాయి, పోతాంటాయి. ఆటివల్ల వొరిగేదేమన్నా వుందా? ఎంతసేపూ మన కోసమే ఆలోచించగూడదండి. అట్టా చూడండి. దైవభక్తిలో ఎలా మునిగిపోయారో భక్తులు."



నిజమే... కళ్ళు మూసుకుని భక్తజనం పూనకం వచ్చినట్టు ఊగుతున్నారు. గొంతు చించుకుని అరుస్తున్నారు. భజన ఆగినప్పుడు మాత్రం నోళ్ళు చెరుముకుంటూ ప్రోజనాల వైపు విక్రమోత్సాహంతో చూస్తున్నారు.

స్వార్థం వాదా? ఈ మానె దుకాణం పెద్ద మనిషిదా? ఆయన కొట్లో మానె కొన్నవాళ్ళెవరూ డాక్టరు దగ్గరకు పోకుండా వుండలేరు. డాక్టరు దగ్గరేమైనా కమీషన్ కొడతాడో ఏమిటో రోగుల్ని సృష్టిస్తున్నందుకు.

"ఆంజనేయం, వందే లంకాదహనకారే... మారుతాత్మజే..." మరల మైకు బద్దలవుతోంది. ఇదేమిటి!మరల నామస్మరణ మారిపోయింది.

మెల్లగా గుర్నాథందగ్గరికి వెళ్ళి "దైవభక్తిని కాదనను. అది వ్యక్తిగతం. ఎవరికి వారు, లేదా అందరూ కలిసినిశ్చల భక్తితో, నిశ్శబ్దంగా ధ్యానించుకోవచ్చు గదా భగవంతుణ్ణి..."

"సాయిరాం... సాయిరాం... సీతారాం... సీతారాం..." మైకులో మార్మోగుతోంది.

"నేను పుట్టపర్తి కూడా వెళ్ళానండి ఒకసారి. అచట ఎంత నిశ్శబ్దం. ఎంత ప్రశాంతత. స్వామి వారి కంఠస్వరం ఆ నిశ్శబ్దంలోంచి ఎంత మృదుమధురంగా, గంభీరంగా వినిపిస్తుందో. అదీ గాక స్వామివారికి విద్య అన్నా, విద్యావ్యాప్తికై కృషి చేయడమన్నా ఎనలేని గౌరవాభిమానాలు గదా! మరి మీరు పరీక్షల్ని..." సూర్యంగారి మాటల్ని వినిపించుకోవడానికక్కడ లేదు ముక్త సరిగా 'నాథ్' అని పిలిపించుకునే గుర్నాథం.

చేతికున్న బంగారపు చైను మీద పొదిగిన ఖరీదైన రాళ్ళు, వేళ్ళకున్న ఉంగరాల్లోని రాళ్ళు మెరుస్తూండగా చేతులూపుతూ ఏవో ఆదేశాలిస్తున్నారు. మైకుల శబ్దం పెంచమంటున్నాడేమో.

నాలుగేళ్ళ క్రితం తట్ట నెత్తిని పెట్టుకుని ఈ ఊరొచ్చిన గుర్నాథం ఈ రోజు లక్షాధికారి. మొదట్లో జీడీలు, తేగలు, పప్పుండలు, బిళ్ళలు అమ్ముతుండేవాడు. కొత్తల రోజుల్లో పిల్లల దగ్గర, కూలీల దగ్గర వడ్లు చవగ్గా కొనేవాడు. అలా అలా మెల్లగా ఒక దుకాణం ప్రారంభించాడు. ఇప్పుడా దుకాణం చాలా పెద్ద షాపయింది. ఇంకో ప్రక్క మానె వ్యాపారం కూడా బాగా లాభాలు తెచ్చిపెడుతోంది. అన్నింటినీ మించి వడ్డీ వ్యాపారం. ఒక మేడ కట్టాడు. ఆ సందర్భంలోనే ఈ భజన కార్యక్రమం ఏర్పాటుచేసినట్లున్నాడు.

ఈ ఊరితో సూర్యం మాస్టారికున్న అనుబంధం గుర్నాథానికి తెలియదు. ట్రాన్స్ఫరై ఇక్కటికి వచ్చినప్పుడు ఆయన భార్యతో వచ్చారు.

